నాగరిక వికాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: నాగరిక వికాస్‌ కేంద్రం (రహనుమా సెంటర్‌)ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. శేరిలింగంపల్లిలోని బాపూనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నాగరిక వికాస కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందనే ప్రభుత్వం అందించే పథకాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవలను కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సెంటర్‌లో టైలరింగ్‌, కంప్యూటర్‌ తరగతుల వంటి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. ప్రజల కోసం దశలవారీగా సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్‌ కార్యదర్శి ఇక్బాల్‌ హుస్సేన్‌ తెలుగు రైటర్‌ అబ్దుల్‌ రషీద్‌, నగర అధ్యక్షుడు ముబాషీర్‌ అహ్మద్‌, నిర్వాహికులు, లింగంపల్లి వకీల్‌ అహ్మద్‌, ముంతాజ్‌ బేగం పాల్గొన్నారు.

‘హెచ్‌సీయూ’లో పూర్వ విద్యార్థుల సమావేశం


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ స్వర్ణోత్సవ ఏడాదిలో సిల్వర్‌ జూబ్లీ రీయూనియన్‌ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ‘సెలబ్రేషన్‌ ఆఫ్‌ ఇన్నోవేషన్‌ అండ్‌ ఫ్రెండ్‌షిప్‌’ పేరిట ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో 25 ఏళ్ల క్రితం నాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్సెస్‌(ఎస్‌సీఐఎస్‌)లోని ఎంటెక్‌ 1998–99 బ్యాచ్‌ విద్యార్థులు ఆదివారం క్యాంపస్‌లో అడుగిడి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అంతేకాక ఎస్‌సీఐఎస్‌ ప్రొఫెసర్ల ప్రసంగాలు, నెట్‌ వర్కింగ్‌ అవకాశాలపై చర్చలు, పూర్వ విద్యార్థుల తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం నాటి ప్రొఫెసర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్‌ దేబాషిస్‌ ఆచార్య, కె. సాయి జవహర్‌, మాజీ ప్రొఫెసర్లు అరుణ్‌ కె పూజారి, ప్రొఫెసర్‌ హృషికేష్‌ మొహంతి, చక్రవర్తిభగవతి, కెఎన్‌మూర్తి, ఎస్‌కేఉద్గత, సల్మాన్‌, పూర్వ విద్యార్థులు, సూర్యనారాయణమూర్తి, ఢిల్లీబాబు, ఉపేంద్రప్రాటూరి, ఎన్‌ వెంకటేష్‌ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ సంస్థ ఉమ్మడి మెదక్‌ జిల్లా అధ్యక్షుడు మెట్టుకుమార్‌


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న శ్రీధర్‌, రవికుమార్‌

పటాన్‌చెరు టౌన్‌: రక్తదానం ప్రాణదానంతో సమానమని హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ సంస్థ ఉమ్మడి మెదక్‌ జిల్లా అధ్యక్షుడు మెట్టు కుమార్‌ అన్నారు. తలసేమియ వ్యాధి బాధిత చిన్నారుల కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, టీఎండీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్‌ మాట్లాడారు. తలసేమియా వ్యాధి బాధిత చిన్నారులకు 15 రోజులకు ఒకసారి రక్తాన్ని మార్పిడి చేయాలన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉండే రోగులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తదాతలు ప్రాణదాతలుగా మారుతున్నారన్నారు. ఇలాంటి శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బాపు వెంకన్న, మహేశ్‌, జ్యోతి, శ్రీనివాస్‌, అన్వర్‌ సాబ్‌, వేణుగోపాల్‌, అరవింద్‌, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో 5కె రన్‌



5కె రన్‌లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో ఆదివారం 5కె రన్‌ నిర్వహించారు. సర్వైకల్‌ కేన్సర్‌ నివారణకు రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ గత సంవత్సరం నుంచి 2500 మంది వరకు వ్యాక్సినేషన్‌ వేశారు. దీనిలో 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న 1500 మంది పిల్లలకు ఉచిత వ్యాక్సినేషన్‌ అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా అవగాహన, రన్‌, వాక్‌ కార్యక్రమాన్ని జనరల్‌, లాప్రోస్కోపిక్‌ సర్జన్‌ డా. శ్రీనివాసులు పచమట్ల ఆధ్వర్యంలో రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ వారు ఏర్పాటు చేశారు. ఈ వ్యాక్సినేషన్‌ కార్యక్రమానికి సహకరిస్తున్న విక్రమ్‌ దేవ్‌, మీరావవి, అపర్ణ రావ్‌, ప్రశాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఈఓ డాక్టర్‌ యోబు, డాక్టర్‌ ఛాయా దేవి, డా. శ్రీనివాసులు, హాస్పిటల్‌ మెడికల్‌ డైరెక్టర్‌ డా. కమలాకర్‌, వైద్యులు లోకేష్‌ రెడ్డి, ఆదిత్య, పావని, మంజుల, సుధారాణి, సుప్రియ, లావణ్య, శృతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



నాట్యం.. శోభితం

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సిద్దేంద్రకళాపీఠం, నాట్యగురువు డాక్టర్‌ రుద్రవరం సుధాకర్‌ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు వైష్ణవి, నయా, ఉపద్రష్ట, శ్రీనిధి, అలేఖ్య, నవ్యమాలం ప్రదర్శించిన నాట్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. –మాదాపూర్‌

100 శాతం.. చెత్త సేకరణే లక్ష్యం!

- ఐటీ కారిడార్‌లో స్వచ్ఛ ఆటోల సంఖ్య పెంపు దిశగా చర్యలు
- ఆటోలకు జియో రూట్‌ మ్యాపింగ్‌
- 15 రోజుల్లో జీవీపీల తొలగింపు


రోడ్లను ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు


జీవీపీ పాయింట్‌ వద్ద చెత్త తరలిస్తున్న ఆటో కార్మికులు

గచ్చిబౌలి: చెత్త రహిత కాలనీలు, బస్తీలు మార్చేందుకు జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి నేతృత్వంలో పక్కా ప్రణాళిక రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ పరిధిలోని యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్‌, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిళ్లలో పారిశుద్ధ్యం పకడ్బందిగా నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారించి చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. ఇళ్లు, షాపుల నుంచి వచ్చే చెత్తను పారబోయక ముందే సేకరించాలని లక్ష్యంతో పని చేస్తున్నారు. అందుకు అవసరమైన ఏర్పాటు త్వరలో కానున్నాయని కమిషనర్‌ వెల్లడించారు.

పని విభజనతో..

ఐటీ కారిడార్‌లోని ప్రధాన రహదారులు, కూడళ్లు, షాపింగ్‌ కాంప్లెక్స్‌లలో ఊడ్చడం, చెత్త సేకరించేందుకు 2 కిలో మీటర్లకు ఒక గ్రూపు, ఎస్‌ఎఫ్‌ఏను నియమించనున్నారు. రోడ్లను ఊడ్చే సిబ్బంది ఒకేచోట గుంపులుగా ఉండి పని చేయడం నిత్యం కనిపిస్తుంటుంది. ఇప్పుడిలా కాకుండా పని విభజన చేయనున్నారు. 500 మీటర్లకు ఒక సిబ్బందిని నియమిస్తారు. షాపింగ్‌ కాంప్లెక్స్‌లు ఎక్కువగా ఉండటం, చెత్త ఎక్కువ వచ్చే ప్రాంతమైతే దూరం తగ్గిస్తారు. కేటాయించిన ప్రాంతంలోనే సిబ్బంది, గ్రూపు పని చేయాల్సి ఉంటుంది. షాపుల ముందు డబ్బాలు పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, చర్యలు విధిస్తారు. 500 ఇళ్లకు ఒక స్వచ్ఛ ఆటో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

163 జీవీపీ పాయింట్ల తొలగింపు..

ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో వెయ్యి, రెండు వేల ఇళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో చెత్త సేకరణ సరిగ్గా లేకపోవడంతో ఖాళీ ప్రదేశాలలో డంప్‌ చేస్తున్నారు. 500 ఇళ్ల టార్గెట్‌గా ఆటోల సంఖ్యను పెంచనున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఆటోవాలాలకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్‌తో పాటు జియో మ్యాపింగ్‌ చేయనున్నారు. స్వచ్ఛ ఆటో ఆ రూట్‌లో ప్రతి రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరించే విధంగా సంబంధిత సిబ్బంది, అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వారం రోజుల్లో రోడ్ల వెంట పొదలు, గడ్డి, మట్టిని దాదాపు 155 కిలో మీటర్ల పొడవునా తొలగించారు. 163 జీవీపీ పాయింట్లను(చెత్త పడేసే) తొలగించారు. 85 కమ్యూనిటీ హాళ్లు, 80 విద్యా సంస్థలను శుభ్రం చేశారు. 10 రైల్వే ట్రాక్‌లు, 55 వీక్లీ మార్కెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.


రోల్‌ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం..



మల్టీ నేషన్‌ కంపెనీలకు నిలయంగా ఉన్న శేరిలింగంపల్లిలోని ఐటీ కారిడార్‌కు ఎంతో మంది విదేశీలు, ప్రముఖులు వస్తుంటారు. ప్రధాన రహదారులు, మాల్స్‌, షాపింగ్‌ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, కాలనీలు పరిశుభ్రంగా ఉంటేనే హైదరాబాద్‌ బ్రాండ్‌ ఇమేజీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇండోర్‌, భోపాల్‌ సిటీలో పారిశుద్ధ్య మెరుగుగా నిర్వహించడానికి అక్కడి ప్రజల చైతన్యం కారణంగా చెప్పవచ్చు. సిబ్బందికి పని విభజన, ప్రజల భాగస్వామ్యంతో గతంలో ఎన్నడు లేని విధంగా పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాం. ఐటీ కారిడార్‌ను రోల్‌మోడల్‌గా తీర్చి దిద్దే లక్ష్యంగా పని చేస్తున్నాం.

–పి.ఉపేందర్‌ రెడ్డి, జోనల్‌ కమిషనర్‌, శేరిలింగంపల్లి

కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరల వివరాలు.. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 70, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 70, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 30, క్యారెట్‌ 60, చిక్కుడు 70, ఉల్లి 40, ములక్కాయలు (3) 20, క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 190, వెల్లుల్లి 280.

దైవ చింతనతోనే ప్రశాంతత


విగ్రహ ప్రతిష్ఠాపనలో కార్పొరేటర్‌

పటాన్‌చెరు టౌన్‌: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఖుషి డిఫెన్స్‌ కాలనీలో అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కుమార్‌ను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన వితరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఖుషి డిఫెన్స్‌ కాలనీ వాసులు పాల్గొన్నారు.

బాంబే షర్ట్‌ కంపెనీలో మోడల్స్‌ సందడి



గచ్చిబౌలి: బాంబే షర్ట్‌ కంపెనీలో బిగ్‌బాస్‌ ఫేమ్స్‌, పలువురు మోడల్స్‌ సందడి చేశారు. కొత్తగూడలోని శరత్‌సిటీ క్యాపిటల్‌ మాల్‌లో బాంబే షర్టింగ్‌ కంపెనీని ప్రారంభించారు. బాంబే షర్ట్‌ కంపెనీ డిజైన్‌ చేసిన షర్ట్‌లను ధరించి బిగ్‌బాస్‌ ఫేమ్స్‌ రాజ్‌, అనీల్‌ రాథోడ్‌తో పాటు పలువురు మోడల్స్‌ ఫొటోలకు ఫోజులిచ్చారు. సీఈఓ అక్షయ్‌ నార్వేకర్‌ మాట్లాడుతూ.. రెడీమేడ్‌ షర్టులు, టైలర్‌ మేడ్‌ బ్లేజర్స్‌, జీన్స్‌, చినోస్‌, టీ–షర్టులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి

- కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌


మధు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న కోలీ సామాజికవర్గ సభ్యులు

పటాన్‌చెరు: జాతీయ స్థాయిలో కోలీ (ముదిరాజ్‌) సమాజ్‌ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. ఆదివారం కర్ణాటకలోని చించొలి నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ పట్టణ కేంద్రంలోని కోలీ సమాజ్‌ భవనంలో సభ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి స్థానిక ఇన్‌చార్జి, కాంగ్రెస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్‌ రాథోడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చించోలి కోలీ సమాజ్‌ ఆధ్వర్యంలో నీలం మధును ఘనంగా సత్కరించారు. కోలీ సమాజ్‌ భవనానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. దక్షిణ భారతదేశంలో రెండు కోట్లకు పైగా దేశ జనాభాలో 6 శాతం పైగా ఉన్న కోలీ సమాజ్‌ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన కోలీ సమాజాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ బలోపేతానికి మనమంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోలి సమాజ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌, కాంగ్రెస్‌ నియోజకవర్గ యూత్‌ ప్రెసిడెంట్‌ సురేశ్‌, నియోజకవర్గ కోలి సమాజ్‌ ప్రెసిడెంట్‌ అనిల్‌ జమేదార్‌, రాములు షాదీపూర్‌, వెంకట్‌ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల అద్దెలో పదిశాతం రాయితీ

మియాపూర్‌: వివాహాది శుభకార్యాలు, విహార యాత్రలు, పుణ్యక్షేత్ర సందర్శనల కోసం ఆర్టీసీ మియాపూర్‌–డిపో నుంచి అద్దె బస్సులకు పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు మేనేజర్‌ వెంకటేషం తెలిపారు. రాయితీతో పాటు ఆర్డినరీ, మెట్రో బస్సులకు డిపాజిట్‌ లేకుండా ఇస్తున్నామని మరిన్ని వివరాల కోసం 008336063,7382821471,8008430202,9059162162 నంబర్లలో సంప్రదించాలన్నారు.




ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జగదీశ్వర్‌ గౌడ్‌

వైభవంగా బోనాలు

శేరిలింగంపల్లి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల ఉత్సవాలు శేరిలింగంపల్లిలో ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రావణ మాస బోనాల మహోత్సవాలు లింగంపల్లి వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. బాపూనగర్‌ పోచమ్మ ఆలయం కిక్కిరిసింది. కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- బాపూనగర్‌ పోచమ్మ తల్లి అమ్మవారికి బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్‌, నాయకులు ఎల్లేష్‌, చంద్రమోహన్‌, గుణశేఖర్‌, రమేష్‌, శివ, సాయి, సుధాకర్‌, హరిశంకర్‌తో కలిసి పూజలు చేశారు.

మదీనాగూడలో

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని మదీనాగూడలో శ్రావణ మాస బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ అమ్మవారికి శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌ గౌడ్‌ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారికి సమర్పించామన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌


పూజల్లో పాల్గొన్న రవికుమార్‌యాదవ్‌

నేడు ‘హర్‌ ఘర్‌ తిరంగా’ బైక్‌ ర్యాలీ

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నానక్‌రాంగూడలో ‘హర్‌ ఘర్‌ తిరంగా బైక్‌ ర్యాలీ’ నిర్వహిస్తున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్‌, ట్రిపుల్‌ఐటీ కూడలి, అపర్ణాసైరస్‌ పార్కు, మసీదుబండ మీదుగా భిక్షపతి నిలయం వరకు సాగుతుందన్నారు. బీజేపీ శ్రేణులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు వీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

మియాపూర్‌–ఒంగోలుకు సూపర్‌ లగ్జరీ బస్సులు

మియాపూర్‌: ఆర్టీసీ మియాపూర్‌–2 డిపో పరిధిలో మియాపూర్‌ నుంచి ఒంగోలుకు ప్రతిరోజు రెండు సూపర్‌ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు మేనేజర్‌ వెంకటేషం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం సర్వీస్‌ నంబర్‌ 1536,1537 ఉదయం 8 గంటలకు వెళ్తుంది. మియాపూర్‌, నిజాంపేట్‌, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, ఎస్‌ఆర్‌నగర్‌, అమీర్‌పేట్‌, లక్డీకపూల్‌, ఎంజీబీఎస్‌,ఎల్బీనగర్‌ మీదుగా ఒంగోలుకు వెళ్తాయన్నారు.

ఘనంగా మహా కుంభాభిషేకం


కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ను సన్మానించిన ఆలయ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఆదర్శనగర్‌లో వెలిసిన విజయదుర్గాభవాని అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని కోరుకున్నామన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను స్థానికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌, పలువురు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియంలో సంబురాలు


సంబరాలు చేసుకుంటున్న హాకీ క్రీడాకారులు

గచ్చిబౌలి: భారత హాకీ జట్టు ఒలింపిక్‌లో కాంస్య పతకం సాధించడంతో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. శనివారం స్టేడియంలో జూనియర్‌ జాతీయ జట్టు ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా విజయ్‌ మాట్లాడుతూ.. హాకీలో కాంస్య పతకం రావడం రెట్టింపు ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యదర్శి భీమ్‌సింగ్‌ మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ 9 నుంచి 18 వరకు జలందర్‌లో హాకీ జూనియర్‌ జాతీయ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వేణు గోపాల్‌, సురేందర్‌ సింగ్‌, హుస్సేన్‌, బీస్‌ మహ్మద్‌ పాల్గొన్నారు.

పట్టుబడ్డ 212 మంది మందుబాబులు

రాయదుర్గం: మద్యం తాగి వాహనాలు నడిపిన 212 మంది పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైబరాబాద్‌ పరిధిలో వీకెండ్స్‌లో చేపట్టిన స్పెషల్‌ డ్రంకెన్‌ డ్రైవ్‌లో 165 ద్విచక్ర వాహనాలు, 10 మూడు చక్రాల వాహనాలు, 34 నాలుగు చక్రాల వాహనాలు, 3 భారీ వాహనాల డ్రైవర్లు పట్టుబడ్డారని వీరందరిని హెచ్‌బీఎల్‌ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

సౌండ్‌ తగ్గించమన్నందుకు కుర్చీతో దాడి

గచ్చిబౌలి: చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని పాటల సౌండ్‌ ఆపాలని కోరినందుకు ఓ వ్యక్తి కుర్చీతో దాడి చేసిన ఘటన రాయదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్‌ వివరాల ప్రకారం.. ఖాజాగూడలోని లలిత బ్లూమ్‌ఫీల్డ్‌ విల్లాస్‌లో 16 నెంబర్‌ విల్లాలో సూర్య అనే వ్యక్తి నివాసముంటున్నాడు. విల్లా నెంబర్‌ 6లో ఉంటున్న రాజేంద్రన్‌ ప్రతి రోజూ పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు పెడుతున్నాడు. పాటల శబ్దాలతో చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని సూర్య, అతని కొడుకు రాజేంద్రన్‌ విల్లాలోకి వెళ్లగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాజేంద్రన్‌ కుర్చీతో సూర్యపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు కేన్సర్‌ ఉచిత వైద్య పరీక్షలు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు కేన్సర్‌ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్‌ జాహిద్‌ షరీఫ్‌ బాబా ఆదివారం పేర్కొన్నారు. ఓరల్‌, బ్రెస్ట్‌ సర్వికల్‌ కేన్సర్‌ స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 100 మంది వరకు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం


సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఇద్దరు లబ్ధిదారులకు రూ.80 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.